ప్రజాశక్తి
మంగళవారం 5 నవంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి- అరకులోయ:కబ్జాకు గురి అవుతున్న అరకు లోయలోని శ్మశానవాటికను పరిరక్షించాలని స్థానిక వర్తకులు గిరిజనులు కోరుతున్నారు. స్థానికులు, వ్యాపారులు, వర్తకులు సోమవారం శ్మశాన వాటికను పరిశీలించారు. పూర్వం నుంచి అకులోయ సమీపంలోని రైల్వే గేటు చొంపి రోడ్డులో అప్పట్లో శ్మశాన వాటికకు సుమారు ఎకరానికి పైగా స్థలంను కేటాయించారన్నారు. కొంతమంది వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే సగభాగం హైవే రోడ్డు నిర్మాణంతో పోయిందని మిగిలిన స్థలాన్ని కబ్జా కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని కోరారు.

మాట్లాడుతున్న గ్రామస్తులు

గిరి గ్రామాల్లో ప్రధాన సమస్యలపై దృష్టి సారించండి

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాడేరు:గ్రామాలలో ప్రజలకు నిత్యావసరాలైన తాగు నీరు, సాగు నీరు, విద్య, వైద్యం, రహదారుల ఏర్పాటుపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షలో మంత్రి మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. మూడు ఐటిడిఎల పరిధిలో ఉన్న ప్రాజెక్ట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ. ఆసుపత్రులలో డాక్టర్లను నియమించినప్పటికీ వారు ఉండటానికి ఇష్టపడటం లేదని, వారికి వసతి సౌకర్యాలు లేవన్నారు. అదనంగా కొత్త అంబులెన్సులను కేటాయిస్తే మృతదేహాలను వారి గ్రామాలకు తరలించడానికి వినియోగించాలని మంత్రి దృష్టికి తీసుకు రాగా మంత్రి స్పందిస్తూ 35 అంబులెన్సులు, వంద ఫీడర్ అంబులెన్సులు మంజూరు అయ్యాయన్నారు. స్థానికంగా ఉన్న డాక్టర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేసారు.అరకు ఎంపి తనూజా రాణి మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కువగా బి పాజిటివ్ బ్లడ్ అవసరమైనప్పటికీ సరిపడినంత నిల్వలు లేవని తెలిపారు. అరకు శాసనసభ్యులు రేగం మత్స్య లింగం, రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీషాదేవి మంత్రి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందిస్తూ త్వరలోనే అందరు ఎఎన్ఎంలు జిల్లాకు వస్తారని స్పష్టం చేసారు. అదేవిధంగా ఇటీవల వరదలకు పాడైన 43 కిలోమీటర్ల సీలేరు రహదారి నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని వివరించారు.

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్ 2047ను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏడాది 15 శాతం గ్రోత్ రేట్ ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో తాగు నీరు సరఫరాకు అవసరమైన నీటి వనరులను గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ అమిత్ బర్ధార్, సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, కట్టా సింహాచలం, భరత్, సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రి, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలి

పాడేరు: గిరిజన యువత ఉన్నతంగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎపిఆర్ కళాశాలలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, రంపచోడవరం ఎం.ఎల్.ఎ శిరీషా దేవి, ఐసిడిఎస్ పి.డి. ఎన్. సూర్యలక్ష్మి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు..

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

పాడేరు: ఏజెన్సీలో ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మించి గిరిజనుల డోలీ మోతల కష్టాలను నిర్మూలిస్తామని జిల్లా ఇన్జార్జి మంత్రి, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం ఆమె జిల్లా కేంద్రం పాడేరు లో పర్యటించారు. మండలంలో పర్యటించి బంగారు మెట్ట గ్రామంలో ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ దీపం పథకం 2.0 పథకంలో ఉచిత గ్యాస్ పంపిణీని ప్రారంభించారని చెప్పారు. మహిళలు వ్యాపారాలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు.

చర్చలు జరుపుతున్న యాజమాన్యం

కాఫీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అంగీకారం

ప్రజాశక్తి - చింతపల్లి : - ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏ పీ ఎఫ్ డి సి) పరిధిలో పని చేస్తున్న కాఫీ కార్మికులు, హెల్పర్లు ఏపీ ఎఫ్ డి సి కార్యాలయంలో ఆర్ఎం, డి ఎం లతో సోమవారం జరిగిన చర్చలలో ఎట్టకేలకు పోరాడి విజయం సాధించారని కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, గత నెల అక్టోబర్ 15న, 10 డిమాండ్ల తో కూడిన సమ్మె నోటీసు యాజమాన్యానికి ఇవ్వడం జరిగిందని స్పందించిన యాజమాన్యం పలు చర్చలు చేపట్టిందన్నారు.ఆ సంస్థ రీజనల్ మేనేజర్ సమక్షంలో చర్చలు అగ్రిమెంటు జరగాలని యూనియన్ పట్టు పట్టడంతో సోమవారం రీజనల్ మేనేజర్ జ్యోతి సమక్షంలో డివిజనల్ మేనేజర్లు సత్యం, కృష్ణ బాబు, రత్న దీపిక, కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఎన్ కనకవల్లి, ఎల్ సుందర్రావు, జి సత్యనారాయణ, హెల్పర్ల సంఘం నుంచి, వెంకటేష్, గిరి, రాజారావు, కాంతమ్మ సమక్షంలో కొన్ని డిమాండ్ల పై చర్చించారు. కాఫీ కార్మికులకు కూలి రేట్లు, పళ్ళ రేట్లు ఏప్రిల్ లో వీడీప పాయింట్లకు అనుగుణంగా 299 రూపాయలకు పెరిగిందన్నారు. రోజువారిగా రోజుకి 22 రూపాయలు, కేజీ పళ్ళ ధర 5 రూపాయల19 పైసలు పెంచడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. పర్మినెంట్ వర్కర్లకు మూడు మాసాలలో క్వార్టర్స్ మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గడచిన మూడేళ్లుగా సంత రోజున వారాంతపు పేమెంట్లు మానేసి, నెలకు ఒకసారి పేమెంట్లు ఇస్తున్నారని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా, వచ్చే నెల నుంచి వారాంతపు పేమెంట్లు సంత రోజున ఇస్తామన్నారు.

కాఫీ తోటల్లో ప్రమాదాలు జరిగితే కార్మికులు కోలుకున్నంతవరకు వైద్యం ఖర్చులు భరిస్తామని, 15 రోజులపాటు వైద్యం ఖర్చులు, రోజు కూలి ఇస్తామన్నారు. తోటల్లో ప్రమాదం జరిగి మరణిస్తే ఆ కుటుంబానికి రెండు లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చేటట్లు సంస్థ నుండి ప్రభుత్వానికి తెలియపరిచి ఇప్పిస్తామన్నారు. ప్లాంటేషన్ హెల్పర్లకు, ప్రస్తుతం ఇస్తున్న వేతనం 11,000వేల నుంచి, 1,500 పెంచి డిసెంబర్ నుంచి 12,500 ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పర్మినెంట్ కార్మికులకు రెండు పండగలకు 5 ఉచిత మస్తర్ల డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. నెలలో 26 రోజులు పని దినాలు కల్పిస్తామన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం కాఫీ కార్మికులు ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ విశ్రాంత డివిజనల్ మేనేజర్ మహేష్, కాఫీ కార్మిక సంఘం ప్రతినిధులు, సూపర్వైజర్లు, పాల్గొన్నారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు

- రాళ్లు, కర్రలతో రహదారి దిగ్బంధం
- దుకాణానికి తాళం వేసి వినూత్న నిరసన

రహదారిని దిగ్బంధించి ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని విద్యానగర్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ గ్రామానికి చెందిన మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానిక పిహెచ్‌సి, బాలుర హాస్టల్‌కు సమీపంలోనూ, అలాగే ప్రాథమిక పాఠశాలకు, నివాస గృహాలకు మధ్యలో మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని మహిళలు ప్రశ్నించారు. గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం దుకాణం దక్కించుకుని జనావాసాల మధ్య ఒక ఇంటిలో దౌర్జన్యంగా మద్యం దుకాణం ఏర్పాటుకు శతవిధాలా గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలోకి ఎవరు రాకుండా ప్రధాన రహదారికి అడ్డంగా రాళ్లు పేర్చి కర్రలతో గేటు ఏర్పాటుచేయడంతోపాటు మద్యం దుకాణం ఏర్పాటు చేయాలనుకున్న ఇంటికి తాళం వేసి ఆందోళన చేపట్టారు.

అంతకుముందే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణం ఏర్పాటుతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని మహిళలు ఆవేదం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న మహిళల వద్దకు స్థానిక ప్రజా ప్రతినిధి గొల్లపూడి పెద్దిరాజు, స్థానిక పోలీసులు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రజలకు అభిప్రాయాలకు విరుద్ధంగా గ్రామంలో మద్యం షాపులు ఏర్పాటు ఉండదని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎస్‌ఐ నరసింహమూర్తి హామీనివ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

జిఓ 3కి చట్టబద్ధత కల్పించాలి

మంత్రికి ఆదివాసీ గిరిజన సంఘం నేతల వినతి



ప్రజాశక్తి -పాడేరు: త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో జీవో 3 కి చట్టబద్ధత కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ చేయాలని గిరిజన వసతి గృహాల నిర్వహణ బాధ్యతలు అక్షయపాత్రకు అప్పగించరాదని సోమవారం పాడేరులో పర్యటించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి 4 నెలలు గడిచినా ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ, జి.ఓ 3 చట్టబద్ధతపై ఎటువంటి నిర్ణయం చేయకపోవడంతో ఆదివాసీ నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అరకులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో స్పెషల్ డిఎస్సీ, జి.ఓ 3 కి చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 5వ షెడ్యూల్డ్ ఆదివాసీ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు ఆదివాసీ నిరుద్యోగలతో భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, జిల్లా నాయకులు కొర్రా నర్సయ్య, తాపుల కృష్ణారావు కోరారు. ఈ సందర్భంగా సురేంద్ర, బాలదేవ్ మాట్లాడుతూ,రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు భద్రత, రక్షణ, పరిపాలన బాధ్యత గూర్చి స్పష్టంగా .ఉందన్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైమ్స్ స్కేల్ ప్రాతిపదికన స్థానికేతరులతో ప్రభుత్వం భర్తీ చేయడంతో ఆదివాసీలు ఉపాధి కోల్పోయారన్నారు.

వినతిపత్రం ఇస్తున్న గంగరాజు

సికిల్ సెల్ ఎనీమియా పై దృష్టి సారించాలి

అనంతగిరి జడ్పిటిసి గంగరాజు

పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనీమియా తీవ్రంగా ఉందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని అనంతగిరి జడ్పిటిసి సభ్యుడు దీసరి గంగరాజు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. కలెక్టరేట్లో కలిసిన ఆయన మాట్లాడుతూ, సికిల్ సెల్ ఎనీ మియా తో విద్యార్థులు అనేకమంది అస్వస్థతకు గురవుతున్నారని మరణాలు కూడా సంభవిస్తున్నాయ తెలిపారు.ఆశ్రమ పాఠశాలల్లో .హెల్త్ వర్కర్స్, ఎ.ఎన్.ఎమ్.లను నియమించాలన్నారు.జి.ఓ 3ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు

పాలవాగుపై వంతెనను పునర్నిర్మించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతూరు : చిడుమూరు, బురకనకోట మార్గంలో పాలవాగుపై శిథిలావస్థకు చేరుకున్న వంతెనను పునర్నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు సోమవారం ముర్రం పిడకయ్య, అధ్యక్షతన జరిగిన సిపిఎం గ్రామ శాఖ మహాసభలో మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నామని ప్రచారం చేస్తూ మౌలిక సమస్యలు ప్రజా అవసరాలను నిర్లక్ష్యం చేసిందని, ఫలితంగానే నేడు గ్రామీణ ప్రాంతంలో కనీస అవసరాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జిఓ 3 ప్రయోజనాలు పునరుద్ధరణతోపాటు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలను అర్హులైన వారందరికీ అందేలా చర్యలు చేపట్టాలని, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్నపుడు బురకనకోట గ్రామంలో కల్పించిన వాటర్ ట్యాంకులు, ప్రభుత్వ భవనాలే తప్ప, విభజన తర్వాత ఎటువంటి అభివృద్ధి, సౌకర్యాలను కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన మంచినీటి మోటారుకు మరమ్మతులు చేపట్టి, పైపులైన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాలని కోరారు. చిడుమూరు నుండి భద్రాచలం రోడ్డు బిటి రోడ్డులో పాలవాగుపై లోలెవెల్ వంతెన వరదల సమయంలో పూర్తిగా ధ్వంసమై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పాలవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మహాసభలో గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా గుర్రం పిడకయ్య ఎన్నికయ్యారు కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు ముర్రం రంగమ్మ, మాజీ సర్పంచ్ మడకం శేషయ్య, గ్రామ శాఖ సభ్యులు కొరస ఎర్రయ్య, పాయం ముత్తయ్య, పెనుబల్లి వెంకయ్య, ఎంపీటీసీ లక్ష్మి, శాంతమ్మ, కుంజ శ్రీను, ముర్రం గంగరాజు కొరస రవి, మడకం సురేష్, పునం కష్ణంరాజు, సోడ్ దుర్గారావు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

'అక్షయపాత్ర'ను అమలు చేస్తే సహించం

-ఎస్ఎఫ్ఐ నేతల నిరసన

ప్రజాశక్తి - చింతపల్లి : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకు వస్తున్న అక్షయపాత్ర విధానాన్ని మన్య ప్రాంతంలో అమలు చేస్తే ఊరుకునేది లేదని ఎస్ ఎఫ్ ఐ నేతలు తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి జిల్లా ఎస్ ఎఫ్ ఐ కార్యదర్శి జీవన్ కృష్ణ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ ఫీజులు తగ్గించాలన్నారు.డిగ్రీ అడ్మిషన్ ఆన్లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్ లైన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను మాట్లాడుతూ, విద్యార్థులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్మిషన్ ఫీజుల భారం మోపుతున్నాయన్నారు.గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ప్రతి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సహాయకులను నియమించాలన్నారు.వంట చేసే కార్మికులను నియమించడంతోపాటు, వారికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వాచ్మెన్‌లను నియమించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలనీ, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.శిథిలావస్థకు చేరిన గిరిజన ఆశ్రమ పాఠశాలల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలన్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్ రాజ్ కుమార్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న పాత్రికేయులు

సిఐ రమేష్‌కు సన్మానం

ప్రజాశక్తి -చింతపల్లి:మన్య ప్రాంతంలో పని చేయడం సంతృప్తిని కలిగించిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ అన్నారు. చింతపల్లి పోలీస్ స్టేషన్లో గడచిన రెండేళ్లుగా విధులు నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ సాధారణ బదిలీలలో భాగంగా విశాఖ సిటీకి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఆయనను స్థానిక పాత్రికేయ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం

- ఐటిడిఎను ముట్టడించిన ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు
- జిఓ 3 పునరుద్ధరణ, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్
- రంపచోడవరంలో భారీ ర్యాలీ, మానవహారం : ఐటిడిఎ వద్ద మహాధర్నా

[illegible] చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిఓ 3 పునరుద్ధరణ, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన, ఇతర హామీలను అమలుచేయాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. సోమవారం ఆదివాసీ నిరుద్యోగులు ఆధ్వర్యంలో రంపచోడవరంలో భారీర్యాలీ, కూడలిలో మానవహారం, ఐటిడిఎ ఎదుట ధర్నా అనంతరం ఐటిడిఎ ముట్టడి ఆందోళనలను చేపట్టారు.

ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీల చట్టాలు, హక్కులను అమలు చేయకుండా పాలకులు నీరుగార్చడమే కాకుండా, మరోపక్క వారి ఉద్యోగ అవకాశాలను అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఓ 3 పునరుద్ధరించి, ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలను స్థానిక గిరిజనులకు దక్కేలా చూడాలని, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించి న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. మెగా డిఎస్‌సి వద్దు, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ముద్దు అంటూ నిరుద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఐటిడిఎ ముట్టడి సమయంలో స్థానిక పిఒ అందుబాటులో లేకపోవడంతో ఎపిఒ, డిఎస్‌పి వచ్చి మాట్లాడినా నిరుద్యోగులు, విద్యార్థులు సంతృప్తి చెందలేదు. పిఒ నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించడంతో, వెంటనే ఫోనులో సంప్రదించి, ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ప్రభుత్వ హామీలు, అధికారులిచ్చిన మాటలను నిలబెట్టుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో నిరుద్యోగ జెఎసి నాయకులు చందు, అశోక్, నవీన్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, డివిజన్ చైర్మన్ పందుల కామరాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు సోడే మురళి, బంగారు వెంకటేశ్వర్లు, తీగల బాబూరావు, వంతు బాలకృష్ణ, రంపచోడవరం జెడ్‌పిటిసి పండా వెంకటలక్ష్మి, ఎంపిపి బంధం శ్రీదేవి, పులి సంతోష్, శీలం శ్రీను, గణేష్, వినోద్, కె. రామన్నదొర, నరసన్న దొర, నాగరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారంగా ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థులు

ర్యాలీగా వెలుతున్న జెఎసి నాయకులు, లోతా రామారావు, తదితరులు

సమస్యలపై సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి -వై రామవరం: ఈనెల 7 నుంచి 20 వరకు అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో సమస్యలపై నిర్వహించే సమగ్ర సర్వేకు సహకరించాలని ఎంపిడిఒ బాపన్నదొర అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆనంద్ అధ్యక్షతన నిర్వమించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని 17 పంచాయతీల్లో నెలకొన్న రహదారి, విద్యుత్తు, తాగునీరు, మురుగు కాలువలు, సిసి రోడ్లు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ నెల 7 నుంచి నిర్వహించే సర్వేలో ఆర్‌డబ్ల్యుఎస్, ఇతర శాఖల అధికారులు పాల్గొని సమస్యలను సేకరిస్తారని, ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివకుమార్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ మణికంఠ, ఎంఇఒ కె..తాతబ్బాయి దొర ఎపిఒ పి.స్వామి, సాయిబాబా పాల్గొన్నారు.

మండల సభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ బాపన్న దొర

బదిలీ ఎస్ఐకి ఆత్మీయ వీడ్కోలు



బదిలీ ఎస్ఐ రామకృష్ణను సత్కరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: ముంచంగిపుట్టు మండలానికి బదిలీపై వెళుతున్న స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది, తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ జి 42 బెటాలియన్ ఇనస్పెక్టర్ వికాస్‌కుమార్ పాండే, ఎస్ ఐ రవీంద్ర స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ, స్థానిక వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య తదితరులు దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాస్ కుమార్ పాండే, తదితరులు మాట్లాడుతూ, రెండున్నరేళ్లపాటు ప్రజలు, ఇతర ఉద్యోగులతో మమేకమై ఎస్ఐ రామకృష్ణ విధులు నిర్వహించారని, ఎటువంటి సమస్య తలెత్తకుండా చూశారని కొనియాడారు. సిఆర్‌పిఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులకు ఎటువంటి సహకారం కావాలన్నా అందించే వారన్నారు.

ఎస్ఐ రవీంధ్ర మాట్లాడుతూ, రామకృష్ణ కూడా తన బ్యాచ్‌కు చెందిన వాడేనని, అప్పట్లో ఎంతో యాక్టివ్‌గా ఉండేవాడన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ, అందమైన ప్రదేశమని, ఇక్కడ జ్ఞాపకాలు, ప్రజలతో సత్సంబంధాలు చిరస్థాయిగా గుర్తిండిపోతాయన్నారు. విధి నిర్వహణలో అధికారులతోపాటు ప్రజలు అందరూ ఎంతగానో సహకరించారని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనలాగే తన బ్యాచ్‌మేట్ రవీంద్రకు సహకారం అందించాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

సర్వే చేస్తున్న పశువైద్యాధికారి

గ్రామాల్లో పశుగణన సర్వే

ప్రజాశక్తి -అనంతగిరి:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపడుతున్న పశు గణన సర్వే 2025 ఫిబ్రవరి నెల వరకు జరుగుతుందని పశువైద్య శాఖ సాగర గణేష్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోమవారం కాశీపట్నం, సుబుద్రపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పశు గణనలో భాగంగా పశుజాతుల వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. పశుగణనకు 21 మంది ఎన్యుమరేటర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు: వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఇందులో భాగంగా ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై విధివిధానాల ద్వారా అవగాహన కల్పిస్తామని చెప్పారు. గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పిఎస్.కుమార్ మాట్లాడుతూ, వృద్ధులను గౌరవించడం సమాజంలో ప్రతీ ఒక్కరి బాధ్యత అని, వారిని భారంగా భావించకుండా వారి అనుభవాన్ని,జ్ఞానాన్ని ప్రస్తుత తరం నేర్చుకోవాలన్నారు. వృద్ధుల సంరక్షణ పట్ల కుటుంబ సభ్యులు శ్రద్ధ వహించాలని, వారికి మంచి ఆహారం, దుస్తులతోపాటు వైద్య సౌకర్యం అందించాలని అన్నారు. వైద్యులు కృష్ణారావు మాట్లాడుతూ, వృద్ధులు తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని, సక్రమంగా మందులు వాడాలని సూచించారు. త్వరలోనే సదరం క్యాంప్ నిర్వహిస్తామని చెప్పారు. లీడ్ బ్యాంక్ అధికారి నాయుడు మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు నిర్వహణలో వృద్ధులకు పలు సూచనలు చేశారు. సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు నాగభూషణం, ఈవోఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

సిఐగా వినోద్ బాబు

ప్రజాశక్తి - చింతపల్లి : చింతపల్లి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎం.వినోద్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి సోషల్ మీడియా సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులతో సిఐ మాట్లాడుతూ, పాత్రికేయులు, ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పటిష్టంగా నిర్వహిస్తానన్నారు. మన్యంలో పరిస్థితులను అవగాహన చేసుకుని గంజాయి సాగు, అక్రమ రవాణా, అసాంఘిక కార్య కలాపాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. అతివేగంగా తిరిగే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాలలోనూ పోలీసు నిఘాను పటిష్టం చేస్తామన్నారు.

ఎస్ఐగా రామకృష్ణ

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల సబ్ ఇన్స్పెక్టర్‌గా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై రవీంద్ర సీలేరు బదిలీపై వెళ్లారు. సీలేరులో రెండేళ్లుగా విధులు నిర్వహించిన ఎస్సై రామకృష్ణ ముంచింగి పుట్టుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా గంజాయి సాగు, రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన అన్నారు.

సమస్యలపై విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి -పాడేరు : విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పాడేరులో ధర్నా నిర్వహించారు. అనంతరం పాడేరు పర్యటనకు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, కొండబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నైట్ డ్యూటీలు, ఇన్ క్యాంపుల వద్ద డ్యూటీలు రద్దు చేసి పే స్కేల్ జీతాలు చెల్లించేందుకు అసెంబ్లీ సమావేశంలో తీర్మానించాలని డిమాండ్ చేశారు. అటెండర్, వాచ్ మెన్,డ్రైవర్, వీఆర్వో పోస్టులు అర్హులైన వారికి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందజేస్తున్న విఆర్ఎలు

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఐజి

రికార్డులను తనిఖీ చేస్తున్న డిఐజి గోపీనాథ్ జెట్టి

ప్రజాశక్తి-అరకులోయ : అరకులోయ లోని పోలీస్ స్టేషను విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు.పోలీస్ స్టేషన్ లో క్రైమ్ రికార్డ్స్ ను పరిశీలించి కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డిఐజి పలు సలహా సూచనలు చేశారు.రానున్న మూడు నెలలు అరకు లోయకు టూరిస్ట్ తాకిడి ఎక్కువగా ఉంటుందని సేఫ్టీపై జాగ్రత్త తీసుకోవాలన్నారు. అరకులోయలోని అన్ని హొటల్స్, రిసార్ట్, షాప్ లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. క్రమం తప్పకుండా స్కూల్, హాస్టల్ లను సందర్శిస్తూ విద్యార్థులకు చెడు వ్యసనాల జోలికి పోకుండా అవగాహన కల్పించాలని సూచించారు. అరకు లోయ ప్రాంతంలో ఎటువంటి జూదం, వ్యభిచారం, కాయిన్ బిజినెస్ వంటివి జరగకుండా చూడాలని అటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో సిబ్బందితో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

గీతం విద్యార్థుల ఇంజినీరింగ్ ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : ఇంజినీరింగ్ అభ్యసించే సమయంలో పొందిన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి స్వయంగా తయారుచేసుకున్న మోటారు వాహనంతో జాతీయ స్థాయిలో జరిగిన సామర్థ్య పరీక్షల పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ సత్తాను చాటి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గీతంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల సొసైటి ఆఫ్ ఆటో మోటివ్ ఇంజినీర్స్ (గీతం ఆటోమేటివ్ క్లబ్)లో సి.హెచ్.ఉదిత్‌కుమార్, వి.యశ్వంత్, వి.యు.ఎస్.పవన్‌యశ్వంత్, కె.సాయిరాజస్వాన్, వై.శ్రీకాంత్‌రెడ్డి, ఎ.ఎస్.మురారి, కె.మోహనిస్, పి.శ్రీకాంత్, కె.వరుణ్, ఎస్.అచింతా సభ్యులుగా ఉన్న గీతం విద్యార్థులు ఇటీవల నోయిడాలోని బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన ఇండియన్ కార్టింగ్ రేస్ -2024 పోటీలలో పాల్గొని దేశంలోని 55 విశ్వవిద్యాలయాల జట్లతో పోటీపడి ఈ ఘనతను సాధించారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి, సాంకేతిక పరిజ్ఞానం, స్వయంగా తయారుచేసే వాహనం సామర్థ్యం వంటివి గుర్తించి ప్రోత్సహించడానికి గత పదేళ్ల నుంచి జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. గీతం అటోమేటివ్ క్లబ్ సభ్యులుగా ఉన్న విద్యార్థులు వాహనం ఇంజిన్ నుంచి త ౕ య ౕ ా రీ ల ో ఉపయోగించే చిన్న చిన్న బోల్టు వరకు స్వయంగా ఎంపిక చేసుకొని వాహన డిజైనింగ్ ప్రకారం వెల్డింగ్ పనులు సహితం నిర్వహించి నాలుగు నెలల ప్రణాళికతో "టీమ్ టైరంట్స్ ఇవి" పేరిట వాహనాన్ని తయారు చేశారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుల పర్యవేక్షణలో రూపొందించిన వాహనంతో జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించారు. విద్యార్థుల ప్రతిభను గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, విద్యార్థి విభాగం డైరక్టర్ డాక్టర్ రేమా చౌదిరి, మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రామారావు, స్టూడెంట్ లైఫ్ ఎల్.అభిషేక్ అభినందించారు. విద్యార్థులు భారత ప్రభుత్వ వికసిత భారత్ -2047 లక్ష్యాలకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో మరిన్ని విజయాలు సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

సామర్థ్య పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : ఆర్‌టిసి బస్సు ఢీకొని ద్విచక్ర వాహపదానేడే దుర్మరణం చెందిన ఘటన గాజువాక మోహిని థియేటర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన షోజీ పూయాట్ (40) గాజువాక ఆటోనగర్‌లో ప్రయివేటు ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇంటి నుంచి విధులకు వెళ్తుండగా మోహినీ థియేటర్ వద్ద బస్సు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరారీ నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : దారి కాచి భయభ్రాంతులకు గురిచేసే ముఠాలో ఉంటూ పరారీలో ఉన్న నిందితుడిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ బొడ్డేపల్లి సుధాకర్ కథనం ప్రకారం... దారికాచి పలు నేరాలకు పాల్పడిన ముఠాలో నిందితునిగా ఉన్న స్థానిక ఎగువపేటకు చెందిన వాసుపల్లి జగదీష్‌ను చాకచక్యంగా ఎస్ఐ జి.హరీష్, కానిస్టేబుళ్లు అప్పారావు, కనకారావు అదుపులోకి తీసుకున్నారు. జగదీష్‌ను అరెస్ట్ చేసి కేంద్ర కారాగారానికి తరలించారు. ఎస్ఐ హరీష్, కానిస్టేబుళ్లను నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు అభినందించారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాకలోని ఒక హోటల్లో అక్రమంగా ఉంచిన డిఫెన్స్ మద్యం బాటిళ్లను గాజువాక ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. చిట్టినాయుడు కాలనీకి చెందిన సిహెచ్.నాయుడు, మల్కాపురం ప్రాంతానికి చెందిన నవీన్ దగ్గర 37 డిఫెన్స్ మద్యం బాటిళ్లను తీసుకున్నారు. వాటిని గాజువాకలోని ఒక హోటల్‌లో ఉంచారు. ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. సిహెచ్.నాయుడును అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పూడిమడక సమీపంలో సీతపాలెం బీచ్‌లో ఆదివారం కెరటాలకు కొట్టుకెళ్లిన యువకుడు వేపగుంట సమీపం నాయుడుపేట గ్రామానికి చెందిన సిరిగుడి అభిరామ్ మృతి చెందినట్లు సిఐ నరసింగరావు తెలిపారు. సీతపాలెం బీచ్‌లో కెరటాలకు సముద్రంలోకి కొట్టుకెళ్లిన యువకుడిని స్థానిక మత్స్యకారులు రక్షించిన విషయం తెలిసినదే. ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న అభిరామును 108 వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడ వైద్యసేవలు పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడినట్లు తెలిపారు. మృతుని తండ్రి జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నర్సింగరావు తెలిపారు.

పోలీసుల అదుపులో బైక్ రైడర్లు

ప్రజాశక్తి- భీమునిపట్నం : అధిక శబ్దంతో, అతి వేగంగా డ్రైవ్ చేస్తున్న నలుగురిని పోలీసులు బీచ్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను తొలగించి, సాధారణ శబ్దం కలిగే సైలెన్సర్లను అమర్చారు. వారికి జరిమానా విధించారు. ఇక నుంచి అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను ఉపయోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిఐ బొడ్డేపల్లి సుధాకర్, ఎస్ఐ జి.హరీష్ హెచ్చరించారు.

ఫిజియో థెరపీపై శిక్షణ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని సచివాలయం సిబ్బందికి హైదరబాద్ నిజామ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యాన ఫిజియో థెరపీ పై శిక్షణను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎవివి. కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఫిజియో థెరపీవైద్య నిపుణులు మన ఆరోగ్యమే మహాభాగ్యంపై శిక్షణ ఇచ్చారు. ఆహారపు అలవాట్లు, అనారోగ్యంపై ప్రయోగ పూర్వకంగా తెలిపారు. కీళ్లనొప్పులు, పక్షవాతం మొదలగు దీర్ఘ కాలిక రోగాలను ఫిజియో థెరపీ తో బాగు చేసుకోవచ్చునన్నారు. మొబైల్ ఫోన్లు విపరీతంగా వాడటంతో కలిగే అనర్థాలు గురించి తెలిపారు, చిన్న పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వరాదని సూచించారు.

6న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెదబయలు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 6 న వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయబడునని స్థానిక వైద్యాధికారి నిఖిల్, ఎంపీహెచ్‌ఓ వెంకటరావు సోమవారం తెలిపారు. విశాఖపట్నంకు తరలించి మరోసారి పరీక్షించి ఉచితంగా కళ్లద్దాలు, మందులు ఇస్తామన్నారు. నేరుగా ఆధార్ కార్డు పట్టుకొని రావాలన్నారు.

వై.రామవరం ఎంపిడిఒ ఎవరో?

- నెలకొన్న అనిశ్చితి.. పనులు జరగక ప్రజల పాట్లు

ప్రజాశక్తి -వై.రామవరం: వై రామవరం ఎంపిడిఒ ఎవరో తెలియని అనిశ్చితి, దాదాపు ఐదునెలలుగా రెగ్యులర్ ఎంపిడిఒ లేని పరిస్థితుల్లో పనులు జరగక ప్రజలు అవస్థలు పడే పరిస్థితి నెలకొంది. వివరాలివి. ఎన్నికలకు ముందు వై రామవరం ఎంపిడిఒగా పివి. రవికిషోర్ నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం పివి రవికిషోర్ 15 రోజులు సెలవులపై వెళ్లడంతో ఇఒపిఆర్‌డి శివకుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే అతని ఆరోగ్య పరిస్థితి బాగో లేకపోవడంతో, ఆయన స్థానంలో పరిపాలన సౌలభ్యం కోసం ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.బాపన్న దొరకు ఎంపిడిఒగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ నియమించారు. 15రోజుల సెలవుపై వెళ్లిన వై.రామవరం రెగ్యులర్ ఎంపిడిఒ రవికిషోర్, ఇపుడు 140 రోజులు గడిచినా విధుల్లోకి రాలేదు.అయితే ఎంపిడిఒ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారన్న ప్రచారం జరుగుతోంది. అందుకే ఆయన విధుల్లోకి రాలేదని తెలుస్తోంది. దీనిపై ప్రస్తుతం ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కె.బాపన్నదొరను వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను విధులు నిర్వహిస్తున్నారని, రెగ్యులర్ ఎంపిడిఒ వస్తే రిలీవ్ అవుతానని స్పష్టం చేశారు. కాగా బాపన్నదొరను రెగ్యులర్ ఎంపిడిఒగా కొనసాగించాలని స్థానికులు కోరుకోవడం విశేషం.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ శివశంకరరావు అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లెహ సెక్టార్‌లోని హెచ్‌క్యూ - 2 ఆర్‌టిబిడి కింద 194 ఎఫ్‌డి రెజిట్‌లో పనిచేస్తూ ఇటీవల మరణించిన హవల్దార్ శివశంకర రావు అంత్యక్రియలు సోమవారం ప్రభుత్వ లాంఛనాల మధ్య జరిగాయి. తొలుత సోమవారం ఉదయం ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో ఈస్టర్న్ నేవల్ కమాండ్ అధికారులు ఘన నివాళ్లర్పించారు. అనంతరం అనకాపల్లి జిల్లా యలమంచిలిలోని దిమిలి గ్రామంలో అంత్యక్రియలు చేపట్టారు.

సమాజ సేవకులకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో వివిధ రంగాల్లో పలు సేవలు చేస్తున్న సేవారంగ ప్రముఖుల వల్ల సమాజానికి ఎంతగానో మేలు జరుగుతోందని సినిమా హీరో కంచర్ల ఉపేంద్ర అన్నారు. ముందడుగు-9 న్యూస్ ఆధ్వర్యంలో అల్లిపురం వెంకటేశ్వర మెట్ట ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో నగరంలో వివిధ రంగాల్లో పలు సేవలు చేస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ ఈస్ట్ డివిజన్ ఎసిపి లక్ష్మణమూర్తి, బ్రహ్మ కుమారి రామేశ్వరి, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శతాధిక సార్లు రక్త దానం చేసిన వంకాయల జవహర్‌ను, జిల్లెళ్ళమూడి అమ్మ సేవా సమితి కార్యదర్శి మూడడ్ల ఉమామహేశ్వరరావు తదితరులను సత్కరించారు. మల్లేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విపిఎ, డిసిఐలలో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పోర్టు పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో ఈ మేరకు వేడుకలు నిర్వహించారు. సిబిఐ ఎస్‌పి మురళీ రాంభా గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ వారోత్సవాల ప్రాధాన్యతను తెలియజేశారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీలు చేపట్టిన క్రమంలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పిఎస్ఎల్.స్వామి, ఇతర విభాగాధిపతులు హాజరయ్యారు.

ఎస్ఐగా రవీంద్ర బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు ఎస్ఐగా కె.రవీంద్ర సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ముంచంగిపుట్టు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన రామకృష్ణను ముంచంగిపుట్టుమండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కొత్తఎస్ఐ రవీంధ్ర మాట్లాడుతూ, తన దృష్టికి వచ్చిన సమస్యల్లో తన పరిధిలో ఉన్నవాటిని సత్వరమే పరిష్కరించి, మిగతా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు తనకు సహకరించాలని కోరారు. అనంతరం చింతపల్లి ఎఎస్‌పి కె.ధీరజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఎస్ఐ రవీంధ్ర వెళ్లారు.

గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..

8న పోర్టు ఎఓబి వద్ద మహాధర్నా

అభివాదం చేస్తున్న పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రైవేటీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న పోర్టు ఎఓబి వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోర్టు అఖిలపక్ష యూనియన్ల నాయకులు రమణబాబు (ఎఐటియుసి), కె.మంగయ్య (హెచ్‌ఎంఎస్), బి.జగన్, కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు (సిఐటియు), కృష్ణమూర్తి (సిఎఫ్‌టియుఐ), జి.చందు (ఐఎన్‌టియుసి), బి.రవి (బిఎంఎస్), బి.రామారావు (పెన్షనర్ల సంఘం) మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను సాలిగ్రాంపురంలో 1984లో 150 పడకల సామర్థ్యంతో నిర్మించారన్నారు. పోర్టు, డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, విశ్రాంత ఉద్యోగులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు, సిఐఎస్ఎఫ్ ఉద్యోగులకు, వారి కుటుంబీకులకు అది ఎంతగానో సేవలందిస్తోందన్నారు. దశాబ్దాల తరబడి 40 వేల మందికి సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. అటువంటి హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో 'మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్'గా 300 పడకల నిర్మాణం కోసం ప్రైవేటువారికి ఇచ్చేందుకు కుట్రపన్నారన్నారు. పోర్టులో వున్న యూనియన్లన్నీ వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఏకపక్షంగా ఈ నెల 8న టెండరు ఓపెన్ చేస్తున్నాయన్నారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రైవేట్ చేతుల్లో పెట్టడమే అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు పోర్టు ఎఓబి వద్ద మహాధర్నా నిర్వహించనున్నామని, అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోర్టుల్లో పిపిపి, బిఒటి విధానాలు విఫలమయ్యాయని గతంలో స్వయంగా కాగ్ మొట్టికాయలు వేసిన సంగతిని నాయకులు గుర్తుచేశారు.

గంగకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంవిపి క్రైమ్ పోలీసుల చేతిలో కాలు విరిగిపోయిన గంగకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత నెల 26న ఆక్సిజన్ టవర్స్ 820 ఫ్లాట్‌లో ఇంటి పని చేసే గంగను ఎంవిపి క్రైమ్ పోలీసులు దొంగతనం ఆరోపణపై విచారణ నిమిత్తం స్టేషన్‌కి తీసుకువెళ్లి కొట్టడం వల్ల ఆమె కాలు విరిగిందన్నారు. ఫ్లాట్ ఓనర్ ప్రియాంక తప్పుడు ఆరోపణతో ఈ కేసు పెట్టిందన్నారు. స్టేషన్‌లో ఎస్ఐ నరవ జగదీష్, మరో ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు ఎంత పాశవికంగా గంగపై విరుచుకుపడిందీ మణి తెలిపారు. ఆమెను గాయపరిచిన పోలీసులుపైన, నల్లపూసలు దొంగతనం చేసిందని గంగపై తప్పుడు ఆరోపణ చేసిన ఇంటి ఓనర్ ప్రియాంకపైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని గత నెల 30న పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సిపి విచారణ చేసి ఎస్ఐ జగదీష్‌ను సస్పెండ్ చేశారని చెప్పారు. సిఐ బంగారు పాపను మేజర్ విఆర్‌కు నివేదించారన్నారు. ప్రియాంకపై విచారణ చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల వల్లే గంగ కాలు విరిగింది కాబట్టి, ఆమె పనిచేసుకోలేని స్థితిలో ఉంది కనుక ఆమెకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి ఇంటి పని వారుల సంఘం గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు, బాధితురాలు గంగ అన్నయ్య శంకర్, ఎం.దేవి, పి.కుమారి, ఎస్.గౌరి, పి దేవి, వై.దుర్గాభవాని, జి.పద్మ పాల్గొన్నారు.

వైజాగ్ మారథాన్ టీ షర్టు, మెడల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంధ్యా మెరైన్ వైజాగ్ మారథాన్ మూడో ఎడిషన్‌ను డిసెంబర్ 1న నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం సాయంత్రం బీచ్‌రోడ్‌లోని నోవాటల్ హోటల్‌లో మారథాన్ టీ షర్ట్, మెడల్‌ను విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ మాదకదవ్యాల రహిత జీవనశైలిని ప్రోత్సహించడం కోసం తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. అన్ని వయస్సుల వారూ పాల్గొనే విధంగా 21కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆసక్తి గలవారు http://www.vizagmarathon.run లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. రన్‌లో పాల్గొనేవారికి ప్యూమ రేస్ టీ షర్ట్, మెడల్, రేస్ ఫొటోగ్రాఫ్స్, ఎనర్జీ డ్రింక్, అల్పాహారంతో పాటు విజేతలకు 5 లక్షల విలువగల బహుమతులు అందిస్తామని తెలిపారు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ విశాఖ ప్రజలంతా ఈ మారథాన్‌లో పాల్గొని దేశంలోనే విశాఖ నగరాన్ని ఫిట్‌నెస్ సిటీ ఆఫ్ ఇండియాగా నిలపాలన్నారు. కార్యక్రమంలో వైజాగ్ రన్నర్ సొసైటీ సెక్రటరీ కె.శ్రీనివాస్, సంధ్యా మెరైన్స్ డైరెక్టర్ కె.ఆనంద్, అపోలో హాస్పిటల్స్ సిఒఒ రామచంద్ర, వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభు కిషోర్, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ఛైర్మన్ వాసు ప్రకాశం, శివ శివాని పబ్లిక్ స్కూల్ మద్రిపాలెం ఛైర్మన్ నీరజ్ సంపతి తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ రమణ

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి -రంపచోడవరం : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్‌వి. రమణ మాట్లాడుతూ ఈవారం గ్రీవెన్స్‌లో 30 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వై.మల్లేశ్వరరావు, డిఎల్‌పిఒ రఘునందన్, డాక్టర్ వెంకట ఇందిర, ఎడిఎంహెచ్‌ఒ జి.శిరీష, గిరిజన సంక్షేమ ఇఇలు సుబ్బయ్య, తహాశీల్దార్ టి.రామకృష్ణ, ఎంపిడిఒ పి.జయంతి, సిడిపిఒ సంధ్యారాణి, డిటిలు శ్రీధర్, స్వామి, త్రిమూర్తులు, వి. రవీంద్రబాబు, ఎడిఎలు కె. సావిత్రి, సిహెచ్‌కెవి చౌదరి, డిఇఇలు రామచంద్రమూర్తి, గాబ్రియేలు, మల్లికార్జునరావు, డిడి ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కిషోర్, ఎఇఇలు పి. వెంకటరమణ, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ, ఎస్ఒ మార్తమ్మ పాల్గొన్నారు.

తహాశీల్దార్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి రంపచోడవరం : రంపచోడవరం మండల నూతన తహాశీల్దార్‌గా టి. రామకృష్ణ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానన్నారు. కాగా తహాశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను డిప్యూటీ తహాశీల్దార్ సత్యనారాయణ, శివ సీనియర్ అసిస్టెంట్ జిలాని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిర్మల, విఆర్‌ఒలు, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి -సీలేరు: కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో సీలేరు శివాలయం భక్తుల శివనామ స్మరణతో మారుమ్రోగింది. అధికసంఖ్యలో భక్తులు వేకువ జామునే స్థానిక నది స్నానాలు ఆచరించి, శివాలయం వద్ద జమ్మి, రావి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో శివుడిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతిరోజు స్థానిక శివాలయంలో ఆకాశదీపం వెలిగించడానికి కమిటీ చర్యలు చేపట్టింది.

'ఉక్కు' కార్మికుల గోడు పట్టదా ?

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉక్కు కార్మికుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం చెలగాటమాడుతున్నాయని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1362వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఉక్కు ఉద్యోగులకు, ఆరు నెలలుగా కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు అందడం లేదన్నారు. ప్రధాని మోడీ ఓ వైపు దేశం వెలిగిపోతోందని బాకా ఊదుతున్నారని, మరోపక్క దసరా, దీపావళి పండగలకు కూడా జీతాలు అందక ఉక్కు కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కార్మిక కుటుంబాలను మానసిక క్షోభకు గురిచేయడం తగదన్నారు. కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకునే స్థితికి వచ్చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.